క్లుప్తంగా

రోడ్డుకు మరమ్మతు చేయించిన పోలీసులు



ఆత్మకూర్: వర్షాల కారణంగా పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతు చేయించినట్లు సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్, రెండో ఎస్‌ఐ హిమబిందు తెలిపారు. మంగళవారం సాయంత్రం రెండు టిప్పర్ల మిక్స్ డస్ట్‌మెటీరియల్‌ను వేయించి లెవల్ చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఖిల్లాఘనపురం: బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. లేబర్ అధికారి ఎండీ రఫీ ఆపరేషన్ స్మైల్ టీమ్ సభ్యులతో కలిసి మంగళవారం ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని దుకాణాలు, మెకానిక్ షాపులు, తదితర వాటిల్లో బాలకార్మికులు పనిచేస్తున్నారా? అనే విషయమై తనిఖీ చేశారు. దాసరిపల్లి బాలయ్య బైక్‌మెకానిక్ షాపులో హరిజన్ ప్రసాద్ (17)అనే బాలకార్మికుడిని పనిలో పెట్టుకుని పనులు చేయిస్తున్నట్లు గుర్తించారు. చట్టరీత్యా బాలకార్మికులతో పనులు చేయించడం నేరమని మెకానిక్‌షాపు యజమానిపై చర్యలు తీసుకోవాలని లేబర్ కార్యాలయం జూనియర్ అసిస్టెంటు రఫీ ఖిల్లాఘనపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విధులకు ఆటంకం.. వ్యక్తిపై కేసు నమోదు

ఖిల్లాఘనపురం: ఆపరేషన్ ముస్కాన్-ఐఐ లో భాగంగా ఓ దుకాణంలో పని చేస్తున్న బాలుడిని తీసుకెళ్తున్న సమయంలో అడ్డుపడి వారి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మంగళవారం చైల్డ్ లైఫ్ కౌన్సిలర్ రాజేష్‌కుమార్ తన టీమ్ సభ్యులతో కలిసి ఖిల్లాఘనపురంలో బాలకార్మికుల కోసం తనిఖీలు చేపట్టారు. శ్రీనువాస క్లాత్ షోరూంలో కాగితాల రవీందర్ (17) బాలకార్మికుడు పనిచేస్తూ కనిపించాడు. వెంటనే బాలుడిని బాలరక్ష వాహనంలో తీసుకెళ్తున్నారు. ఈ సమయంలో బాలుడి తండిర కాగితాల కృష్ణ వాహనాన్ని అడ్డుకున్నాడు. 'మా బాలుడిని మాకు ఇవ్వాలి' అని వాగ్వాదానికి దిగాడు. ఈ విషయమై తమ విధులకు ఆటంకం కలిగించాడని సదరు అధికారి ఖిల్లాఘనపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

గోపాల్‌పేట: విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత పడిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత రైతు వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన బత్తుల లక్ష్మి, చంద్రయ్య భార్యాభర్తలు. ఎప్పటిలాగే గేదెలను పొలందగ్గరికి తీసుకెళ్లి మేపుతున్నారు. గేదె మేస్తూ బోరువద్దకు వెళ్లి ంది. అంతలోనే విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఆరు నెలల క్రితమే రూ.60వేలు అప్పుచేసి కొన్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



వీపనగండ్ల: మండలంలోని రంగవరం గ్రామానికి చెందిన బోయ ఈశ్వరమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం కాంగ్రెస్ మండల నాయకులు బిచ్చన్న సాగర్ అందజేశారు. పేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ నిధి ఆసరా అవుతుందన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మండలంలోని పలు గ్రామాల్లో ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నిధులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సుదర్శన్, కాంగ్రెస్ నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, నాయకులు యాదయ్య, ఎల్లస్వామి పాల్గొన్నారు.

మాజీ సీఎం మృతి పార్టీకి తీరనిలోటు

అమరచింత: కేరళ మాజీ సీఎం, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు అచ్యుతానందన్ మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి, వెంకటేష్, అజయ్ అన్నారు. మాజీ సీఎం మృతి పట్ల మండల కేంద్రంలోని సీపీఎం జెండా కట్టల వద్ద ఆపార్టీ పతాకం అవగతం చేసి నివాళులర్పించారు. అచ్యుతానందన్ ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

మాతాశిశు సంరక్షణ కార్డుల కొరత



వైద్య పరీక్షల కోసం పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులు (ఫైల్)

- పంపిణీలో తీవ్ర జాప్యం
- ఏడాదిగా జిరాక్స్‌లతో కాలం వెల్లదీత
- పట్టించుకొని వైద్యశాఖ అధికారులు
- ఇబ్బందుల్లో గర్భిణులు

పాన్‌గల్: మాతాశిశు సంరక్షణ కార్డులు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎంతో ఉపయోగపడుతాయి. ఈ కార్డులకు తీవ్రంగా కొరత ఏర్పడింది. చాలా మంది గర్భిణులతో ఈ కార్డులు లేవు. సొంత ఖర్చులతో పాత వాటిని జిరాక్స్ తీసుకోవల్సిన పరిస్థితి నెలకొంది. కార్డుల పంపిణీలో జాప్యం వల్ల, వైద్యసిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు గర్భిణులపై ఆర్థికభారం పడుతోంది.

కార్డులో సమగ్ర సమాచారం..

మాతాశిశు సంరక్షణ కార్డుల్లో గర్భిణుల ఆధార్ కార్డు నంబర్, వారి ఆరోగ్య సమస్యలు, గత ప్రసవ వివరాలు, గర్భస్థ శిశు వివరాలు, బరువు, ప్రస్తుతం అందుతున్న వైద్యం, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స తదితర వివరాలను నమోదు చేస్తారు. మొదటినెల నుంచి తొమ్మిదో నెల వరకు బీపీ, ఇతర పరీక్షల వివరాలు, హిమోగ్లోబిన్ శాతం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తీసుకుంటున్న పౌష్టికాహారం పుట్టిన బిడ్డ పెరిగే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాక్సిన్ల వివరాలన్నీ కార్డులో పొందుపర్చాలి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న కార్డులు ఏడాది కాలంగా ఏజెన్సీ మండలాల్లో సరఫరా కావడం లేదు. కార్డులు దొరకకపోవడంతో, గర్భిణులు సొంత ఖర్చులతో పాత వాటిని జిరాక్స్ తీసుకుని, వారి వివరాలను ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల వద్ద నమోదు చేయిస్తున్నారు. ఉచితంగా అందాల్సిన కార్డులు అందుబాటులో లేకపోవడంతో జిరాక్స్ కేంద్రాల నిర్వాహకులు ఒక్క కార్డుకు రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు. దీంతో విధిలేక జిరాక్స్ తీసుకుని ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది.

మండలాల వారీగా గర్భిణుల వివరాలు..

మండలం	సబ్‌సెంటర్లు	గర్భిణుల వివరాలు
పాన్‌గల్	10	164
చిన్నంబావి	07	155
వీపనగండ్ల	05	113

జిరాక్స్‌కు రూ.50 ఖర్చు..



పేరు నమోదు చేయాలని స్థానిక ఏఎన్ఎం, ఆశా కార్యకర్త వద్దకు వెళ్లాను. కార్డులు లేవని, జిరాక్స్ కేంద్రం నుంచి కార్డు తీసుకొస్తే పేరు నమోదు చేస్తామన్నారు. దీంతో జిరాక్స్‌కు రూ. 50కు కొని తీసుకొచ్చాను. జిరాక్స్ పత్రాలపైనే సిబ్బంది నా పేరు నమోదు చేశారు. ఉచిత కార్డులు పంపిణీ చేస్తే మాలాంటి పేదవారికి ఆర్థికభారం తగ్గుతుంది.

– శివమ్మ, గర్భిణి, పాన్‌గల్

ఎంసీబీ కార్డులు అందించాలి



పీహెచ్‌సీలల్లో మాతాశిశు సంరక్షణ కార్డులు లేక గ్రామీణ ప్రాంతాల్లో పేద గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. కార్డులు పంపిణీ చేయకపోవడంతో వారు సొంతంగా జిరాక్స్ కార్డులను తీసుకుంటున్నారు. ఇప్పటికైనా వైద్యశాఖ అధికారులు స్పందించి కార్డుల పంపిణీ చేసి పేద మహిళల ఇబ్బందులను తొలగించాలి.

– కళావతమ్మ, సీపీఐ నాయకురాలు, కేతేపల్లి

కార్డుల కొరత వాస్తవమే..



ఎంసీబీ కార్డుల కొరత ఉన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని మరోమారు జిల్లా అధికారులకు నివేదించి కార్డులు మంజూరు చేస్తే వాటిని గర్భిణులకు అందజేస్తాం. ప్రస్తుతం వారి వివరాల నమోదుకు జిరాక్స్ కార్డులను వినియోగిస్తున్నాం.

– డా.చంద్రశేఖర్, పీహెచ్‌సీ, పాన్‌గల్

ప్లాస్టిక్ నిషేధంలో భాగస్వాములు కావాలి



బేకరీ యజమానికి జరిమానా విధిస్తున్న హెల్త్ అసిస్టెంట్ శివకుమార్

వనపర్తిటౌన్: ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజలు భాగస్వాములు అయితేనే పట్టణంలో పూర్తిస్థాయిలో ప్లాస్టిక్‌ను నిషేధించడం సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు మంగళవారం పుర వీధుల్లో 100 రోజుల కార్యాచరణ నిర్వహించారు. ఈ సందర్భంగా 3, 5, 23, 15, 8, 30వ, వార్డుల్లో తడి,పొడి వ్యర్థాల విభజన, సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. కమిషనర్ ఆదేశాల మేరకు హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ పట్టణంలోని బేకరీ, హోటల్స్, కిరాణ, తదితర షాపులపై ప్లాస్టిక్ రైడ్ నిర్వహించారు. ఆయా షాపుల్లో ప్లాస్టిక్ దొరకడంతో యజమానులకు జరిమానా విధించారు. మొత్తం రూ.13,500 జరిమానా విధించారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముందుకు

వనపర్తి పురపరిధిలో వర్షాకాలంలో ప్రజలు దోమల ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు మున్సిపాలిటీ తరపున చర్యలు చేపట్టామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు వనపర్తి మున్సిపాలిటీకి కొత్తగా కొనుగోలు చేసిన 6 ఫాగింగ్ యంత్రాల పనితీరును మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ట్రయల్ రన్ చేపట్టారు. ఈ సందర్భంగా జవాన్‌లు బాలరాజు, మన్యం, ముని స్వామి, వెంకటస్వామి తదితరులకు ఫాగింగ్ మిషన్‌ను పుర వీధుల్లో ఎలా ఉపయోగించాలో కౌన్సిల్ హాల్లో ట్రెనింగ్ ఇచ్చారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలకు దూరంగా ఉండవచ్చని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. డ్రై డేలో భాగంగా బహాదూర్‌గూడెంలో సిబ్బందితో ఆయన పర్యటించి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, శైలజ, పంచాయతీ కార్యదర్శి సాజీద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా కృషి చేయాలి

వనపర్తి రూరల్: పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని 11 వార్డులో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ మీరజ్ అహ్మద్ డ్రై డే నిర్వహించారు. హెల్త్‌అసిటెంట్ రాజశేఖర్, ఏఈ యోగేష్, లీలమ్మ, ఏఎన్ఎం లావణ్య,వార్డు ఆఫీసర్ రాములమ్మ, రాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



వనపర్తి రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి నూతన్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని నాచహళ్లి గ్రామంలో గ్రామస్తులకు ఆయన మొక్కలు పంపిణీ చేశారు. గ్రామంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని వారికి ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యపై నిరంతర పోరాటం

అమరచింత: నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం డీవైఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తున్నదని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం డీవైఎఫ్ఐ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువకుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైజ్ఞానిక క్రీడా, సాహిత్య రంగాలలో యువజనుల సంఘం పాటుపడుతుందన్నారు. యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తూ ప్రపంచ శాంతిని డీవైఎఫ్ఐ కాంక్షిస్తుందన్నారు. కార్యక్రమంలో చంటి, తిరుపతి, అశోక్, మనోహర్ పాల్గొన్నారు.

బాల్యవివాహాల నివారణపై అవగాహన



బాల్య వివాహాల నివారణపై పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

పాన్‌గల్: బాల్యవివాహాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యం చేయాలని తహసీల్దార్ అబ్రహాంలింకన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రూరల్ అభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నివారణపై అవగాహన కల్పించే వాల్‌పోస్టర్లను తహసీల్దార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆడ పిల్లలను మగపిల్లలతో సమానంగా చదివించాలని, బడి పిల్లలను పనిలో పెట్టుకోవడం, బాల్య వివాహాలు చేయడం నేరమని, ఇలాంటి చట్టా వ్యతిరేక పనులు చేస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్లు 1098, 112 లేదా 100కు సమాచారం అందించాలన్నారు. బాల్యవివాహాల నిరోధించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌నాయుడు, సొసైటీ ప్రతినిధి రాజశేఖర్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ మీడియం పాఠశాల గది స్వాధీనం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాల గదిని మంగళవారం ఎంఈఓ జయశంకర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ గదిలో గతంలో ఉర్దూ మీడియం పాఠశాల నిర్వహించేవారు. విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో పాఠశాలను మూసివేశారు. కొంతకాలంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు స్వాధీనంలోకి తీసుకుని ఉపయోగించుకుంటున్నారు. ఈ విషయం తెలియడంతో మంగళవారం ఎంఈఓ తన సిబ్బందిని పంపి పాఠశాల గదికి తాళం వేసుకున్నారు. ఇక నుంచి ఎవరికీ ఇచ్చేదిలేదని, విద్యాశాఖ పరిధిలోనే ఉంటుందని చెప్పారు.

పోడు రైతులకు పట్టాలివ్వాలి

పాన్‌గల్: గిరిజనులు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. మంగళవారం పాన్‌గల్ మండలంలోని కిష్టాపూర్‌తండాలోని సర్వే నంబర్ 34లో సాగుచేసుకుంటున్న రైతులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా గిరిజనులు పోడు భూములను సాగుచేసుకుంటున్నా, వాటికి పట్టాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి సాగుచేసుకుంటున్నా రైతులకు పట్టాలు ఇచ్చి ఫారెస్టు అధికారుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

యాంత్రీకరణ సాగులో ముందుండాలి

అమరచింత: రైతులు వ్యవసాయ పద్ధతులలో యాంత్రీకరణ విధానాలతో వ్యవసాయం చేసే విధంగా ఎదగాల్సిన అవసరం ఉందని ప్రొఫేసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో అవగాహన కల్పించినట్లు ఏఓ అరవింద్ తెలిపారు. నాగల్‌కద్మూర్ రైతు వేదికతో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా యాంత్రీకరణ సాగుపై అవగాహన కల్పించామని, నందిమళ్ల క్యాంపులోని రైతు వేదికలో ఆయిల్‌ఫాం సాగు వల్ల కలిగే ప్రయోజనాలు రైతులకు వివరించామన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ మండల అధికారి సురేష్, ఏఈఓలు, ఆయా క్లస్టర్ల రైతులు పాల్గొన్నారు.

దాశరథికి ఘన నివాళి

వనపర్తిటౌన్: తెలంగాణ ప్రజల గుండెచప్పుడు నిజాంకు వినిపించిన కవితామూర్తి దాశరథి కవితలు, గేయాలు మరువలేనివని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో దాశరథి 101వ జయంతిని మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు.



గంగమ్మతల్లి తెప్పోత్సవంలో నృత్యం చేస్తున్న మహిళలు



అమరచింతలో బోనమెత్తిన మహిళలు



చర్లపల్లిలో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

ఘనంగా గంగమ్మ తల్లి ఉత్సవాలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో గంగమ్మతల్లి ఉత్సవాలు దేవాలయ కమిటీవారు, ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన తెప్పోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో పోచమ్మ బోనాలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బెస్తగేరి లో పోచమ్మ, మైసమ్మ బోనాల పండుగ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండలంలోని చర్లపల్లి గ్రామంలో గ్రామ దేవత పోచమ్మకు ప్రజలు బోనమెత్తారు. ఆలయం దగ్గర మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి అన్ని ఏర్పాటు చేశారు.

అమరచింత: 'అమ్మ పోచమ్మ తల్లి కరుణించమ్మ' అంటూ మండలంలోని నాగల్ కద్మూర్, పాంరెడ్డిపల్లె, అమరచింత పట్టణాల్లో గ్రామ దేవత పోచమ్మకు బోనాలు ఘనంగా నిర్వహించారు. అమరచింతలో ఉప్పరి తిరుపతి సొంత డబ్బులతో పోచమ్మ ఆలయం, కాళీకాలయం, పెద్దపీర్ల మసీదు, మార్కండేయ ఆలయం వద్ద స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయడంతో ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

తీగజాతి మొక్కల తొలగింపు

వీపనగండ్ల: మండలంలోని తూముకుంట గ్రామ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పలు రకాల తీగచెట్లు కప్పేయడంతో సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'ట్రాన్స్‌ఫార్మర్‌పై తీగలు తొలగించండి' అనే కథనం వచ్చింది. దీంతో స్పందించిన విద్యుత్ అధికారులు మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న తీగచెట్లను తొలగించారు. ఈ సందర్భంగా సాక్షి దినపత్రికకు గ్రామస్తులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..



ట్రాన్స్‌ఫార్మర్‌ను కప్పేసిన తీగచెట్లను తొలగిస్తున్న అధికారులు

కన్సల్టెన్సీ కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



ఐటీఐ కళాశాలను తనిఖీ చేసి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: యువతకు టాటా కన్సల్టెన్సీ ద్వారా ఆధునిక కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రాంగణ నియామకాలు ఇచ్చే వృత్తి విద్య కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం వనపర్తి మండలం నాగవరం వద్ద ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి ఉత్తీర్ణత చెందిన యువతకు ఆయా రంగాల్లో ఆధునిక వృత్తి శిక్షణ ఇచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నుంచి టాటా కన్సల్టెన్సీతో ఒప్పందం చేసుకుని విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా టాటా కన్సల్టెన్సీ వారు ఆధునిక యంత్రాలు, పరికరాలతో అడ్వాన్స్ శిక్షణ కేంద్రాన్ని (ఏటీసీ) ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోపా, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ వంటి కోర్సులతో పాటు ఆధునిక రోబోటిక్, ఎలక్ట్రిక్ వెహికల్ మెకానిక్, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఆర్టిసిజమ్, అడ్వాన్స్‌డ్ మెషీనింగ్ టెక్నీషియన్ వంటి మొత్తం 10 కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రాంగణ నియామకాలు సైతం చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల్లో కొత్తగా ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ కేంద్రంలో జరుగుతున్న తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. నూతన భవనం త్వరగా పూర్తి చేసి వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అనంతరం వైటీసీ కేంద్రం (ప్రస్తుతం మెడికల్ కళాశాల బాలుర వసతి గృహం) భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవనానికి ఏమైనా మరమ్మతు అవసరం ఉన్నాయా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవనం ఆవరణలో ఒక కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఓ పీడీ ఉమాదేవి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కే.రమేష్ బాబు, వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



ఆత్మకూర్‌లో పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

ఆత్మకూర్: పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, కేసుల నమోదు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, గేమింగ్, బెట్టింగ్, గంబ్లింగ్ జరగకుండా ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని, చోరీలు జరగకుండా గస్తీలు నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపాలిటీలోని వార్డులకు, గ్రామాలకు పోలీసు అధికారులను కేటాయించి సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలపై పూర్తిస్థాయిలో సమాచారం రాబట్టాలన్నారు. పోలీసులు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా సమయపాలనతో ఉండాలని, సమస్యల పట్ల నిమిషాల వ్యవధిలో సంఘటన స్థలానికి చేరుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించి ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. కేసుల నమోదులో జాప్యం జరగకుండా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

గణేష్ ఉత్సవాల్లో డీజే వాడితే చర్యలు..

రానున్న గణేష్ ఉత్సవాల్లో డీజే సౌండ్ మిక్సర్లు ఉపయోగించడాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని, డీజే వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శబ్దకాలుష్యం నివారించడానికి నిర్వాహకులు సాంప్రదాయ బద్ధంగా గణేష్ నిమజ్జనాలను నిర్వహించాలన్నారు. దేశ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడంలో అందరు భాగస్వామ్యం కావాలని కోరారు. ఆదేశాలను దిక్కరించేవారిపై పర్యావరణ పరిరక్షణచట్టం సెక్షన్ 15 కింద కేసులు నమోదుచేసి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఒకలక్ష జరిమానాను విధించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆత్మకూర్ సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్, రెండో ఎస్ఐ హిమబిందు, సిబ్బంది ఉన్నారు.

డిజిటల్ తరగతులు ప్రారంభం



విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న ఎంఈఓ

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం డిజిటల్ తరగతులను ఎంఈఓ కృష్ణయ్య, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు నోట్ బుక్స్, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం అందిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరవింద్, నవీన్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 31వ, వార్డు బసవన్నగడ్డలో నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపేయాలని కాలనీ ప్రజలు వాపోతున్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకుడు ఫజల్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. సెల్ టవర్‌ని నివాస ప్రాంతాలకు దగ్గరగా నిర్మించొద్దని, పిల్లలు, గర్భిణులు ఎక్కువ సమయం టవర్ సమీపంలో ఉంటే త్వరగా అనారోగ్యం బారిన పడతారని, పుట్టబోయే పిల్లలపై సైతం రేడియేషన్ ప్రభావం ఉంటుందని చెప్పారు. నివాస ప్రాంతాల్లో టవర్ నిర్మాణానికి అనుమతి ఇవ్వొద్దని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎం. కృష్ణయ్య, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

వీపనగండ్ల: వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నప్పుడే వారు విద్యలో రాణించగలుగుతారని మండల విద్యాధికారి నర్సింహులు అన్నారు. మంగళవారం నాగర్లబండతండా, వల్లభాపురం, వల్లాభాపురంతండా ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య, రవి, అంజి, ఉపాధ్యాయులు మురళి, సీఆర్‌పీ నాగరాజు పాల్గొన్నారు.

'పది'విద్యార్థులపై దృష్టి సారించాలి

పాన్‌గల్: ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని మాందాపూర్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పబ్లిక్ పరీక్షలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఏ రోజుకు సంబంధించినవి ఆ రోజు చదవాలన్నారు.

పెద్ద కాల్వను అండర్ డ్రెయినేజీగా మార్చండి

అమరచింత: పట్టణంలోని పెద్ద చెరువు కాల్వను మున్సిపల్ అధికారులు అండర్ డ్రెయినేజీగా మార్చి ఆయా వార్డు ప్రజల ఆరోగ్యాలను కాపాడాలంటూ మున్సిపాలిటీ సమస్యల సాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు.

మున్సిపాలిటీ ఎదుట నిరసన

మున్సిపాలిటీలో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రెయినేజీ, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని మున్సిపాల్టీ ఎదుట మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ యూసుఫ్‌కు వినతిపత్రం అందించారు.